డబ్బులు రాష్ట్రానివి.. డబ్బా బీజేపీది!





PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

ఆవుల తరలింపులోనూ తూతూమంత్రం!




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 224 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 09 ఆగస్టు 2026



# ప్రశ్నలతో ఆగొద్దు.. పరిష్కారాలు చూపండి

**యువత సామర్థ్యాలపై పూర్తి నమ్మకం ఉంది**

**వారి ఆలోచనలు, నిర్ణయాలే వికసిత్ భారత్‌కు దిశానిర్దేశం : ప్రధాని మోడీ**

**ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు**

**న్యూఢిల్లీ,ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ యువత సమస్యలను గుర్తించి ప్రశ్నించడం మాత్రమే కాకుండా, వాటికి పరిష్కారాలను కనుగొనే దిశగా ఆలోచించాలని ప్రధాని మోడీ సూచించారు. యువత సామర్థ్యాలపై తనకు పూర్తి నమ్మకం ఉందని అన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మోడీ..పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు ఇప్పుడు అడుగుపెడుతున్న ప్రపంచం వేగంగా మారుతోందని చెప్పారు. సాంకేతికతతో పాటు అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. రాబోయే 20--30 ఏండ్లలో ప్రపంచంలో ఎలాంటి మార్పులు మిగతా2లో...

# ఎల్‌నినోతో సాగునీటికి కష్టాలు

**సాగర్ నీళ్లు తాగడానికే సరిపోవు**

**రైతులు ఆరుతడి పంటలనే వేయాలి**

**సాగునీటి సలహామండలి సమావేశంలో కోమటిరెడ్డి**




**నల్గొండ ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, అంతేకాక పైనుంచి నీరు వచ్చే అవకాశం కూడా లేనందున రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి వేయకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని మిగతా2లో...

# ప్రాజెక్టుల భూసేకరణకు రూ. 5వేల కోట్లు

**అటవీ, పర్యావరణ అనుమతులపై నిర్లక్ష్యం వద్దు**

**మిడ్ మానేర్ ఎడమ కాలువ పనుల పునః ప్రారంభం : నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**



**హైదరాబాద్, ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావసం కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. నిధుల కొరత కారణంగా సాగునీటి పనులు ఆగొద్దని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్.అంబేడ్కర్ సచివాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, డి. శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇందులో ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయనీ, మిగిలిన రూ.3 వేల కోట్లు ప్రాధాన్యతా క్రమంలో మిగతా2లో...

# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

- తెలంగాణ కోసం కొట్లాడిన మాకు తెలియదు
- నీటి వాటాల విషయంలో తేడా వస్తే తెలంగాణ భగ్గుమంటది
- నీళ్లు ఎత్తిపోయడం కూడా చేతకాని సిఎం రేవంత్ రెడ్డి
- మీడియా సమావేశంలో మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్,ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** క్షుద్రపూజలు అని చెప్పి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వాళ్లం. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం మిగతా2లో...

# డిలిమిటేషన్‌పై తమిళనాట ఆసక్తికర సన్నివేశం

**సిఎం విజయ్ నేతృత్వంలో అఖిలపక్ష ఎంపిల భేటీ**

**ఉన్న ఎంపి సీట్లను అలాగే కొనసాగించాలని డిమాండ్**




**చెన్నై,ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'డీలిమిటేషన్' ప్రక్రియపై తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకుండా అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శనివారం చెన్నైలోని కలైవానర్ అరంగంలో తమిళనాడు ఎంపీలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అయితే, రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలతో పాటు పీఎంకే, డీఎండీకే ఈ భేటీని బహిష్కరించడం చర్చనీయాంశమైంది. పార్టీ రాజకీయాలకు అతీతంగా తమిళనాడు హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్, విసికె, సిపిఐ సిపిఎం, ఎండిఎంకె, ఐయూఎంఎల్ పార్టీలకు చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈ భేటీలో మిగతా2లో...



# నేడు,రేపు హైదరాబాద్ బోనాలు

- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్,ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలు ఆగస్టు 9, 10 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. లాల్ దర్వాజా, కార్వాన్ దర్బార్ మైసమ్మ, అంబర్‌పేట్ మహంకాళి, చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వెల్లడించారు. లాల్ దర్వాజా బోనాల మిగతా2లో...

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

● సరూర్ నగర్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే ● రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ హామీ మోసానికి నిదర్శనం ● ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు




**హైదరాబాద్, ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను ప్రభుత్వం అవమానించిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ.. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్ అయ్యిందంటూ ఫైర్ అయ్యారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా లేక మిగతా2లో...

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

**15 ఆగస్ట్‌న ప్రారంభించనున్న సిఎం**



# ప్రశ్నలతో ఆగొద్దు..పరిష్కారాలు చూపండి

(మొదటి పేజీ తరువాయి)

వస్తాయో ముందుగానే చెప్పడం సాధ్యం కాదని చెప్పారు. అందువల్ల యువతలో ఎప్పుడూ నేర్చుకోవాలనే ఆసక్తి ఉండా లన్నారు. జీవితాంతం విద్యార్థులుగా కొనసాగాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త విషయాలను నేర్చుకునేవారే విజయాన్ని అందుకుంటారని తెలిపారు.

**సమస్యలను చూసి భయపడొద్దు**

జీవితంలో వచ్చే సమస్యలను చూసి భయపడాల్సిన అవసరం లేదని, పెద్ద సవాళ్లను చిన్న చిన్న భాగాలుగా విభజించి వాటికి పరిష్కారాలను అన్వేషించాలని మోడీ సూచించారు. కొత్త ఆలోచనలు, వినూత్న పరిష్కారాలను కనుగొనే ధైర్యం ఉంటే సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవచ్చునన్నారు. ప్రతి తరానికీ దేశం పట్ల బాధ్యత ఉంటుందని మోడీ వివరించారు. రాబోయే 30--35 ఏండ్లలో యువత తీసుకునే నిర్ణయాలు, చేపట్టే కార్యక్రమాలే వికసిత్ భారత్ దిశను ప్రభావితం చేస్తాయని అన్నారు. తాము తీసుకునే ప్రతి నిర్ణయం దేశానికి ఎంతవరకు ఉపయోగపడుతుందో యువత ఆలోచించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాల కోసం తాము ఏమి చేయగలమనే ప్రశ్నను ప్రతి యువకుడు తనకు తాను వేసుకోవాలని మోడీ సూచించారు.

**విద్యార్థులకు స్వర్ణ పతకాలు ప్రదానం**

స్నాతకోత్సవంలో ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు దీన్‌దయాల్ శర్మ స్వర్ణ పతకం, డైరెక్టర్ స్వర్ణ పతకాలను మోడీ ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్నవారిలో మహిళల సంఖ్య తక్కువగా ఉండటాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. మరింత మంది మహిళలు ఈ స్థాయిలో ప్రతిభ చూపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఐఐటీ ఢిల్లీ సోనిపత్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ కేంద్రం 'పరం ప్రజ్ఞ'ను ప్రధాని ప్రారంభించారు.

# డిలిమిటేషన్‌పై తమిళనాట ఆసక్తికర సన్నివేశం

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 వద్దే ఉంచాలని ఈ సందర్భంగా ఎంపీలు డిమాండ్ చేశారు. తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 39 లోక్‌సభ స్థానాల కేటాయింపులో ఎలాంటి మార్పులు చేయకూడదని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని ఎంపీలు గుర్తుచేశారు. ఇప్పుడు కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల సంఖ్యను పెంచితే, జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు లబ్ది చేకూరి, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తీవ్రంగా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు పాత్రను పార్లమెంట్‌లో తగ్గించే ఏ డీలిమిటేషన్ సూత్రాన్నైనా తీవ్రంగా నిరసిస్తామని, లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచితే అది ప్రభావవంతమైన పార్లమెంట్ కాబోదని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం పేర్కొన్నారు. తమిళనాడును ఇన్నేళ్లు పాలించిన డీఎంకే, అన్నాడీఎంకేలు రాష్ట్ర హక్కుల కోసం నిర్వహిస్తున్న భేటీకి రాకపోవడం విచారకరమని, వారికి రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని కాంగ్రెస్ ఎంపీలు ప్రవీణ్ చక్రవర్తి, విష్ణు ప్రసాద్ విమర్శించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన 57 మంది ఎంపీలలో 36 మంది ఈ భేటీకి దూరంగా ఉండటం, విజయ్ ప్రభుత్వానికి స్పష్టమైన ఎజెండా లేదంటూ డీఎంకే ఆరోపించడం.. తమిళనాడు రాజకీయ సమీకరణాలను మరింత ఆసక్తికరంగా మార్చాయి.

# ప్రాజెక్టుల భూసేకరణకు రూ. 5వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేస్తామని చెప్పారు. నిధుల కొరత కారణంగా చివరి దశలో ఉన్న ఏ సాగునీటి ప్రాజెక్టు కూడా నిలిచిపోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులను అత్యంత ప్రాధాన్య అంశాలుగా తీసుకోవాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రాజెక్టుల వారీగా ఎన్ని నిధులు అవసరమో వెంటనే ప్రతిపాదనలు పంపాలనీ, అవసరమైన ఆర్థిక అనుమతులు, టోకెన్లు పొందడంలో జాప్యం చేయవద్దని సూచించారు. నాలుగున్నరేండ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను తక్షణమే పునఃప్రారంభించాలని మంత్రి ఆదేశించారు.సవరించిన అంచనాలు సిద్ధం చేయడం, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, చట్టబద్ధ అనుమతుల సాధన... ఒకదాని తర్వాత మరొకటి కాకుండా సమాంతరంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన లక్ష్మీనరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ పథకం ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు కాకతీయ ప్రధాన కాలువలో డి-83 నుంచి డి-94 వరకు ఉన్న 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. లైడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ ఇప్పటికే పూర్తయ్యాయనీ, బోర్‌హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, జియోటెక్నికల్ పరిశోధనలు కొనసాగుతున్నా యని అధికారులు మంత్రికి వివరించారు. ఆగస్టు నెలాఖరులోగా డీపీఆర్ సమర్పిస్తామని తెలిపారు. సమీక్షలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన ప్రతి సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని, తదుపరి సమావేశం నాటికి వాటిపై తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు.

**రోళ్లవాగు 96 శాతం పూర్తి.....**

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు పనులు 96 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం ఉన్న 0.250 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.949 టీఎంసీలకు పెంచి, స్థానిక పరీవాహక ప్రాంతం నుంచి లభించే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా చివరి ఆయకట్టులోని దాదాపు 15 వేల ఎకరాలకు సాగునీటి భరోసా కల్పించడం ప్రాజెక్టు లక్ష్యమని పేర్కొన్నారు. సర్‌ప్లస్ వీర్, హెడ్ స్లూయిస్‌లతో సహా ప్రధాన నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయని తెలిపారు. బండ్-2లో కొంత భాగం అటవీ భూమిలో ఉండటంతో మిగిలిన పనులు అటవీ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నా యని చెప్పారు. సాంకేతికంగా ఉన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వెంటనే ప్రాజెక్టును వాడుకలో తీసుకు రావాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచించారు. సమీక్షలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లతో పాటు ఇంజినీర్-ఇన్-చీఫ్ ఓవి. రమేష్‌బాబు, నీటిపారుదల శాఖ జాయింట్ సెక్రెటరీ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

(మొదటి పేజీ తరువాయి)

తమకు లేదని వెల్లడించారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటాం. కాంగ్రెస్ లాగా పార్టీ క్షుద్ర రాజకీయాలు మాకు తెలియదని పేర్కొన్నారు. హరీష్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా? కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్‌లోనూ ధ్వంసం చేసి ఓట్లు దండుకోవాలని చూడలేదని ఆరోపించారు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి బీఆర్ఎస్‌ది కాదని అన్నారు. కరెంటు ఉండి కూడా వ్యవసాయదారుడికి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి. కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజూ కరెంట్ కోతలు అవుతున్నాయని విమర్శించారు. కోర్టులు చెప్పినా హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని ప్రజాస్వామిక వాదులు గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనా విధానాన్ని గుర్తించాలని, రేవంత్ రెడ్డి హిట్లర్ అని చెప్పుకున్నట్లే రాజ్యాంగ వ్యవస్థలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇవ్వలేదని, పైగా వేలాది మంది ఇళ్లను కూలగొట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ లోని 10,000 ఎకరాల విలువైన భూమి పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి చేస్తున్న 5 లక్షల కోట్ల స్కామ్ పైన రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేబులో వేసుకుంటుందో ప్రజలందరికీ అర్థమయ్యేలా లేఖల రూపంలో, ప్రజెంటేషన్ ల రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని తెలిపారు. తాము డిమాండ్ చేస్తేగానీ పంప్‌లు ఎందుకు ఆన్ చేయలేదని ప్రశ్నించారు. సీఎంకు ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని విమర్శించారు. హరీశ్‌రావు ఈ విషయంపై ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ అని ఎద్దేవా చేశారు.కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన తెలంగాణలో వస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మీడియాతో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వచ్చేవారం జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం ఎజెండా పూర్తిగా తెలంగాణ హక్కులను కాల రాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను ఏ విధంగా కాపాడతారో రేవంత్, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్ ని సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లోకి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది. చంద్రబాబు చెప్పు చేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు. రేవంత్ రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్ ని తొలగించాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలతో కొట్లాడిన తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీకి తెలంగాణ గురవుతున్నదని, ఇదే జరిగితే కచ్చితంగా బీఆర్ఎస్ మరోసారి నీళ్ల కోసం ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు. నార్లాపూర్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామని బీఆర్ఎస్ హెచ్చరికలకు ప్రభుత్వం దిగివచ్చి పంపులని ఆన్ చేసిందని వెల్లడించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు నీళ్లు ఇచ్చే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తి పోసుకుంటే ముఖ్యమంత్రికి పట్టింపు లేదు. ప్రధాన ప్రతిపక్షం ముళ్లు కట్టెతో పొడిస్తేనే ఈ ప్రభుత్వం స్పందిస్తుంది లేదంటే నిద్రపోతున్నదని పేర్కొన్నారు.

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా అని అన్నారు. ఇంజినీరింగ్ చదివిన విద్యార్థుల ను ముఖ్యమంత్రి స్థాయిలో 'క్రిమినల్ వేస్ట్' అని అవ మానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తు కొస్తోంది. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచే స్తున్నట్టు అని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు నిజం గా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా అని అన్నారు. నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యో గులకు నువ్వు ఇచ్చిన హామీలు బో గస్. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తు న్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికే షన్లు సక్రమంగా రాకపోవడం తో పీజీ, పీహెచ్డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టు ల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం.

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

● 15 ఆగస్టున ప్రారంభించనున్న సిఎం

**నిజామాబాద్,ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. స్మార్ట్ కార్డు విషయంలో దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చేసిన ఆలోచన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. ఆగస్ట్ 15న సంగారెడ్డిలో సిఎం వీటిని ప్రారంభిస్తారు. ఈ స్మార్ట్ కార్డులతో బోగస్ కార్డుల ఎత్తివేత సులువవుతందని భావిస్తున్నారు. జిల్లాల వారిగా స్మార్డ్ కార్డు పంపిణీ అంశంపై శ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌర సర ఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 15 నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తారు. అదేరోజున మిగతా జిల్లాల్లో కూడా ప్రజా ప్రతినిధులు కార్డుల పంపిణీని లాంఛనంగా చేపడతారు. అయితే పంపిణీ వేదికలు, ఏర్పాట్లు తదితర అంశాలపై ఈనెల 11 వరకు స్పష్టత రానుంది. స్మార్ట్ రేషన్ కార్డు ఆకర్షణీయంగా ఉండనుంది. డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఈజీగా వాలెట్‌లో పెట్టుకు నేలా ప్రభుత్వం రూపొందించింది. ఆధునిక సాంకేతిక విలువాలతో కార్డు ఆకర్షణీయంగా ఉంటుందని అధికా రులు అంటున్నారు. కొత్త కార్డుల దరఖాస్తు నిరంతర పక్రియ కావడంతో కార్డుల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానే కొత్త కార్డులను అందిస్తారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికారులు జాబితాను సిద్దం చేశారు.

# నేడు,రేపు హైదరాబాద్ బోనాలు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో పాతబస్తీలో ఆగస్టు 9వ తేదీన ఉదయం 6 గంటల నుంచి, 10వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఊరేగింపు ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. మదీనా ఎక్స్ రోడ్డు నుంచి ఇంజిన్ బౌలి (చార్మినార్, నాగుల్ చింతా మీదుగా) రహదారి బోనాల ఊరేగింపు పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో ఈ రోడ్డును మూసివేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వివరించారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలకు చార్మినార్, ఫలక్‌నుమా వైపు నో ఎంట్రీ ఉంటుందని తెలిపారు. వాహనదారులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించినట్లు వెల్లడించారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాల సందర్భంగా ఆగస్టు 8వ తేదీ రాత్రి 9 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ ఉదయం వరకు పురానాపూల్, జియాగూడ, టప్పాచబుత్రా పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. అంబర్‌పేట్ మహంకాళి ఆలయం వద్ద ఆగస్టు 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ మధ్యాహ్నం 12గంటల వరకు మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. బస్సులు, భారీ వాహనాలు అంబర్‌పేట్ ÷÷-లఓల్గ÷వర్ మీదుగా వెళ్లాలని సూచించారు. చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయం వద్ద ఆగస్టు 9, 10వ తేదీల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. సీతాఫల్‌మండి, పద్మారావు నగర్ వైపు వాహనాలను మళ్లిస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ఎల్‌నినోతో సాగునీటికి కష్టాలు


(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకవేళ నాగార్జునసాగర్ నిండినప్పటికీ చెరువులు నింపే పరిస్థితి లేదని, ఇప్పటికే బోర్లలో కూడా గ్రౌండ్ వాటర్ తగ్గిపోతున్నందున కష్టకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలబడి ఆరుతడి పంటలు వేసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్‌స్టోరేజీలో ఉందని, శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని తెలిపారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. ఏఎంఆర్‌పీ కూడా సగమే నిండిందని, గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని మంత్రి అన్నారు.కరువు వచ్చినప్పటికీ నల్గొండ జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. పనులు కొనసాగుతున్నాయని, ఏఎంఆర్‌పీ, ఎస్‌ఎల్‌బీసీ, బ్రాహ్మణ వె÷-లలెంల ద్వారా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎస్‌ఎల్‌బీసీ కోసం ఎంతైనా ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. కరువు వచ్చినా, శ్రీశైలం డెడ్‌స్టోరేజీలో ఉన్నప్పటికీ ఎస్‌ఎల్‌బీసీ నుంచి సాగునీరు అందించవచ్చన్నారు. రాబోయే రోజుల్లో సూపర్ ఎల్‌నినో కారణంగా దక్షిణ తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు ఆరుతడి పంటలు వేసుకునేలా కష్టపడి పనిచేయాలని, ఇలాంటి కరువు పరిస్థితుల్లో రైతులకు అందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పంట మార్పిడిలో భాగంగా 33 వేల ఎకరాల్లో వరికి బదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అయితే దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకుని రైతులతో ఆరుతడి పంటలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో 9 వేల ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న ఓవర్‌లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామగ్రిని తెప్పిస్తామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కష్టకాలంలో రైతులకు అండగా ఉండాలని, ప్రజలకు ధైర్యం చెప్పాలని, ఆరుతడి పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇకపై జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు.

# హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు

● వేలదిగా తరలివచ్చిన నిరుద్యోగులు

● సరూర్ నగర్ స్టేడియంలో తోపులాట




**హైదరాబాద్,ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని సరూర్‌నగర్ స్టేడియం వద్ద తోపులాట జరిగింది. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పోటెత్తారు. శనివారం, ఆదివారం డ్రైవర్ల ఎంపిక ఉంటుందని హైడ్రా ప్రకటించింది. దీంతో ఇందులో పాల్గొనేందుకు నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. ఇటీవల హైడ్రా విడుదల చేసిన 150 డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రిక్రూట్‌మెంట్ పక్రియ తీవ్ర గందగోళానికి దారి తీసింది. డ్రైవర్ పోస్టుల కోసం రాష్ట్రంలోని నలుమూల నుంచి వేలాది మంది నిరుద్యోగ యువత శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భారీగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు. కేవలం 150 పోస్టులు ఉండగా.. ఊహించిన రీతిలో వేలాది మంది పోటెత్తడంతో స్టేడియం మొత్తం నిరుద్యోగులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత, తోపులాట చోటుచేసుకుంది. గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నప్పటికీ అధికారుల వైపు నుంచి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో లైన్లలో వేచి ఉన్న యువత.. నిర్వాహకుల తీరుపై ఆందోళనకు దిగారు. ఉద్యోగం కోసం జిల్లాలు దాటి వస్తే అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించారంటూ నిరుద్యోగులు వాపోతున్నారు. వెంటనే స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం అభ్యర్థులకు టోకెన్ ఇచ్చి వెనక్కి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. టోకెన్‌లో చెప్పిన టైమ్ ప్రకారం అక్కడకు వచ్చి ఈవెంట్స్‌లో పాల్గొనాలని నిర్వాహకులు చెబుతున్నారు.

# కొలనుపాకలో 'వీరశైవ జంగమ ధూపదీప నైవేద్య అర్చకుల' ఆత్మీయ సమ్మేళనం విజయవంతం


**రాష్ట్ర అడ్హాక్ కమిటీ అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్ (ములుగు జిల్లా, జేడీ మల్లంపల్లి) ఎంపిక**

**300 మంది అర్చకుల సమక్షంలో భవిష్యత్ కార్యాచరణకు శ్రీకారం వేతనం,**

**నైవేద్యం కలిపి రూ. 25,000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్**



**మల్లంపల్లి ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాక గ్రామంలో తెలంగాణ వీరశైవ జంగమ ధూపదీప నైవేద్య అర్చకుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 300 మంది వీరశైవ జంగమ ధూపదీప నైవేద్య అర్చకులు ఈ సమ్మేళనానికి హాజరై, అర్చకుల సమస్యలు, సంక్షేమం మరియు భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా ధూపదీప నైవేద్య అర్చకులకు అందాల్సిన అన్ని సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. అర్చకులకు ప్రభుత్వ గుర్తింపు, సామాజిక భద్రత, ఆరోగ్య బీమా, పింఛన్, గౌరవ వేతనం, దేవాలయాల్లో సౌకర్యాలు మరియు ఆర్థిక పరిరక్షణ కల్పించాలని కోరారు. మారుతున్న కాలంలో ప్రభుత్వం నుంచి వస్తున్న రూ. 4,000 ధూపదీప నైవేద్యం, రూ. 6,000 గౌరవ వేతనం ఏమాత్రం సరిపోవడం లేదని, కనీసం ధూపదీప నైవేద్యానికి మరియు అర్చకుని వేతనానికి కలిపి రూ. 25,000 అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా తెలంగాణ వీరశైవ జంగమ ధూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్రస్థాయి అడ్హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ములుగు జిల్లా, జేడీ మల్లంపల్లి గ్రామానికి చెందిన శివశ్రీ గొంగళ్ల మఠం రాజేంద్రప్రసాద్ ఎన్నుకోబడగా, ప్రధాన కార్యదర్శిగా సదా నిరంజన్ సిద్ధాంతి, కోశాధికారిగా విభూతి పల్లిం గం, ఉపాధ్యక్షుడిగా సురేష్ శాస్త్రి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆకావరం శివప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా గణపతి బుచ్చిలింగం, చెల్పూర్ శంకరయ్యలను ఎన్నుకోవడం జరిగింది. సమ్మేళనాన్ని విజయవంతం చేసిన వీరశైవ జంగమ అర్చకులకు నూతన రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. అర్చకుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని, మన హక్కుల సాధనకు ప్రభుత్వంతో పోరాడి సూచనలు అందేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.



# ఫేక్ ఫైర్ ఎన్‌ఓసీలు సమర్పించిన ఇంటర్ కాలేజీల అనుమతులు రద్దు చేయాలి

**విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కాలేజీ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెట్టాలి**

**బీఆర్ఎస్ మల్లంపల్లి మండల యూత్ అధ్యక్షుడు మొర్రి రాజు యాదవ్ డిమాండ్**




**మల్లంపల్లి, ఆగస్టు 08 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర విద్యాశాఖలో ఫేక్ ఫైర్ ఎన్‌ఓసీల వ్యవహారం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, నకిలీ ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లతో ఇంటర్మీడియట్ కాలేజీల రెన్యువల్ అనుమతులు పొందేందుకు ప్రయత్నించిన కాలేజీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మల్లంపల్లి మండల యూత్ అధ్యక్షుడు మొర్రి రాజు యాదవ్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్న విద్యాశాఖలోనే ఇలాంటి నకిలీ ఎన్‌ఓసీల వ్యవహారం వెలుగులోకి రావడం దురదృష్టకరమన్నారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథన్ సంతకాలను ఫోర్జరీ చేసి ఫేక్ ఫైర్ ఎన్‌ఓసీలు తయారు చేసి ఇంటర్ బోర్డుకు సమర్పించడం అత్యంత తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. కేవలం ఒక అధికారి సంతకమే కాకుండా మరికొందరు ఉన్నతాధికారుల సంతకాలను సైతం ఫోర్జరీ చేసినట్లు ఆరోపణలు రావడం ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇంటర్మీడియట్ ప్రైవేట్ జూనియర్ కాలేజీల రెన్యువల్ అనుమతుల కోసం తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌కు సమర్పించిన ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లను పరిశీలించిన సందర్భంగా 40 నుంచి 50 వరకు నకిలీ ఎన్‌ఓసీ పత్రాలు గుర్తించినట్లు హైడ్రా వెల్లడించిన నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని రాజు యాదవ్ కోరారు. భద్రతా ప్రమాణాలు పాటించని భవనాల్లో విద్యార్థులను చదివిస్తూ వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం ఎంతమాత్రం సమర్థనీయం కాదన్నారు. విద్యార్థుల భద్రత విషయంలో ప్రభుత్వం ఏమాత్రం రాజీ పడకూడదని, ఫేక్ ఎన్‌ఓసీలు సమర్పించినట్లు తేలిన ప్రతి కాలేజీ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**అధికారుల పాత్రపైనా సమగ్ర విచారణ జరపాలి**

నకిలీ ధ్రువపత్రాల వ్యవహారంలో కాలేజీ యాజమాన్యాలతో పాటు వారికి సహకరించిన అధికారులు ఎవరైనా ఉంటే వారిపై కూడా సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించేలా నకిలీ పత్రాలు సమర్పించి కాలేజీల నిర్వహణకు ప్రయత్నించిన యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, బాధ్యులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్న శాఖలోనే ఇలాంటి వ్యవహారాలు చోటుచేసుకుంటే, ఇతర శాఖల్లో పరిస్థితి ఎలా ఉందో ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాశాఖపై పూర్తి స్థాయిలో నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ఫేక్ ఎన్‌ఓసీ బాగోతాలకు అవకాశం ఏర్పడుతోందని విమర్శించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నకిలీ ఎన్‌ఓసీలు సమర్పించిన కాలేజీల అనుమతులను రద్దు చేసి, యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని మొర్రి రాజు యాదవ్ స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే బీఆర్ఎస్ పార్టీ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలనే చిత్తశుద్ధి ముఖ్యమంత్రి గారికి ఉంటే, ప్రభుత్వాన్ని మోసం చేసి అక్రమ మార్గాల్లో కాలేజీలను నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# డబ్బులు రాష్ట్రానివి.. డబ్బా బీజేపీది!

**యూఐడీఎఫ్ రుణం మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది..**

**స్మార్ట్ సిటీ పనుల్లోనూ కేంద్రం వాటా ఇవ్వలేదు: సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**




**కరీంనగర్ టౌన్ ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ అభివృద్ధి విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, బీజేపీ నేతలు చేస్తున్న ప్రచారంపై సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను కేంద్ర ప్రభుత్వ నిధులుగా ప్రచారం చేసుకోవడం సరికాదని ఆయన విమర్శించారు. విలేకరుల సమావేశంలో నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. యూఐడీఎఫ్ రుణం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. యూసీఎఫ్‌కు సంబంధించిన రూ.840 కోట్లలో సుమారు రూ.630 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ వాటానేనని పేర్కొన్నారు. అదేవిధంగా కరీంనగర్‌లో మిగిలిన స్మార్ట్ సిటీ పనులకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా సుమారు రూ.70 కోట్లు ఇచ్చిందని, అయితే కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా మాత్రం ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చి అభివృద్ధి పనులు చేపడుతుంటే వాటిని తమ ఘనతగా చెప్పుకోవడం బీజేపీ నేతలకు తగదన్నారు.

**యువత కోసం ప్రాజెక్టులు తీసుకురండి**

బీజేపీ నేతలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే కరీంనగర్ యువత, నిరుద్యోగుల ఉపాధి కోసం కేంద్రం నుంచి కొత్త ప్రాజెక్టులు తీసుకురావాలని నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచే పరిశ్రమలు, ప్రాజెక్టులు తీసుకురావడంపై దృష్టి పెట్టాలని సూచించారు.

**ఇదేనా బీజేపీ చెప్పిన నిధుల వరద?**

మున్సిపల్ ఎన్నికల సమయంలో బీజేపీ నేతలు, ముఖ్యంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, కేంద్రం నుంచి కరీంనగర్‌కు నిధుల వరద తీసుకొస్తామని హామీ ఇచ్చారని నరేందర్ రెడ్డి గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కరీంనగర్ ప్రజలు చూస్తున్నది ఇదేనా ఆ నిధుల వరద అని ప్రశ్నించారు. కరీంనగర్ నగర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత తమపై ఉందని, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలు గమనిస్తున్నారని నరేందర్ రెడ్డి అన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో బీజేపీ నాయకత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన సవాల్ చేశారు.

# ఆవుల తరలింపులోనూ తూతూమంత్రం!

- మిగతా ఆవులను రోడ్డుపైనే వదిలేయడమేమిటి?
- కోతులు, కుక్కల బెడదపై దృష్టి పెట్టరా?
- బీఆర్ఎస్ కౌన్సిలర్ దుబాసి వెంకటస్వామి




**పరకాల, ఆగస్టు 8 (పీసిడబ్ల్యూ న్యూస్):**
పరకాల పట్టణ ప్రధాన రహదారులపై విచ్చలవిడిగా సంచరిస్తున్న ఆవులు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నా మున్సిపల్ అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఒకటో వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ దుబాసి వెంకటస్వామి మండిపడ్డారు. శుక్రవారం కొన్ని ఆవులను మాత్రమే గోశాలకు తరలించి, మిగతా ఆవులను రోడ్లపైనే వదిలేయడం ఏమిటని ప్రశ్నించారు. సమస్య పరిష్కారంలో అధికారులు తూతూమంత్రంగా వ్యవహరించడం సరికాదన్నారు. పట్టణంలో ప్రధాన రహదారులపై ఆవులు గుంపులుగా సంచరిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రాత్రివేళ ప్రమాదాల ముప్పు పొంచి ఉందన్నారు. ఇదే సమయంలో పరకాల పట్టణంలో కోతులు, కుక్కల బెడద కూడా విపరీతంగా పెరిగిపోయిందని, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించకుండా కొన్ని ఆవులను మాత్రమే గోశాలకు తరలించి చేతులు దులుపుకోవడం ఎందుకని వెంకటస్వామి ప్రశ్నించారు. ఆవులు, కోతులు, కుక్కల సమస్యపై సమగ్ర కార్యాచరణ రూపొందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని, లేదంటే మున్సిపల్ అధికారుల తీరుపై ప్రజల తరఫున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి

- డీసీసీ సెక్రటరీ సయ్యద్ జమాలుద్దీన్



**కరీంనగర్,ఆగస్టు8(పీసీడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని డీసీసీ సెక్రటరీ సయ్యద్ జమాలుద్దీన్ అన్నారు. కరీంనగర్‌లో ప్రస్తుతం పార్టీ బలహీనంగా ఉందని, పార్టీ పదవుల కోసం పోటీ పడుతున్న నాయకులు పార్టీ బలోపేతంపై కూడా దృష్టి సారించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాలంటే నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువ కావాలని కోరారు. కనీసం నెలకు ఒకసారి సమావేశాలు నిర్వహించి పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో పార్టీకి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. తాను డీసీసీ సెక్రటరీగా మాత్రమే కాకుండా సామాజిక కార్యకర్తగా ప్రజల్లో ఉంటూ పరిస్థితులను గమనిస్తున్నానని తెలిపారు. ఇప్పటికైనా సమయం ఉన్నందున నాయకులు ప్రజలతో కలిసి విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సయ్యద్ జమాలుద్దీన్ విజ్ఞప్తి చేశారు.

# ముమ్మరంగా మున్సిపాలిటీ అభివృద్ధి పనులు

- 15వ వార్డులో నూతనంగా సీసీ రోడ్ల నిర్మాణం
- అభివృద్ధి పనులపై కౌన్సిలర్ యాసా నాగమణి శ్రీకాంత్ హర్షం
- ఆనందం వ్యక్తం చేసిన 15వ వార్డు మహిళలు



**కల్లూరు, ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా 15వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. శనివారం కప్పలబంధం రోడ్డులో జానీ ఇంటి సమీపంలో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా 15వ వార్డు కౌన్సిలర్ యాసా నాగమణి శ్రీకాంత్ మాట్లాడుతూ వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని, మరికొద్ది రోజుల్లో 15వ వార్డులో మిగిలి ఉన్న పనులను కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 15వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అన్నారు. కొత్తగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కప్పలబంధం రోడ్డులోని మహిళలు కౌన్సిలర్ యాసా నాగమణి శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు నిర్మాణంతో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకుడు ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద విద్యాలయంలో ఘనంగా ఆషాఢమాస బోనాల వేడుకలు







**గంగాధర, ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం వివేకానంద విద్యాలయం, గంగాధరలో ఆషాఢమాస బోనాల వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు మరియు ఆధ్యాత్మిక విశిష్టతను విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో అలంకరించుకుని కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బోనాలను అలంకరించి అమ్మవారికి సమర్పించే సంప్రదాయాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. ఈ వేడుకల్లో పోతరాజుల విన్యాసాలు, పెద్దపులుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పుల మోతలు, జానపద నృత్యాలు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, మన సంస్కృతిసంప్రదాయాలను చిన్నతనం నుంచే విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వారిలో మన సంస్కృతి పట్ల గౌరవం, అభిమానం పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్అనంతరెడ్డి, ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు, ఉషారాణి, ఉపాధ్యాయులు,విద్యార్థులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు.

# సురభి కాన్వెంట్ హై స్కూల్లో గోరింటాకు మరియు బోనాల వేడుకలు





**గంగాధర ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని సురభి కాన్వెంట్ హై స్కూల్లో శనివారం గోరింటాకు, బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని గోరింటాకు పెట్టుకుంటూ సందడి చేశారు. బోనాలను తలపై ఎత్తుకుని భక్తిశ్రద్ధలతో ప్రదర్శనలు నిర్వహించారు. అబ్బాయిలు పోతరాజు, పులి వేషధారణలో చేసిన జానపద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ పాటలు, నృత్యాలతో విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చిప్ప వీరేశం, డైరెక్టర్ చిప్ప వీర నర్సయ్య మాట్లాడుతూ, ఆధునిక విద్యతో పాటు విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం తమ బాధ్యత అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు చిన్నారుల్లో మన సంప్రదాయాల పట్ల గౌరవం, అభిమానం పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో మృతి చెందిన ఆటో కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల బీమా

**- రాజు కుటుంబానికి ప్రమాద బీమా అందజేత.. ఆటో కార్మికుల సంక్షేమానికి బీమా కల్పించిన కేటీఆర్, చల్మెడకు కృతజ్ఞతలు**

**ఎల్లారెడ్డిపేట ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు బొమ్మనివేణి రాజు నాలుగు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబానికి ఆటో కార్మికుల కోసం కల్పించిన ప్రమాద బీమా ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందింది. జిల్లాలోని సుమారు 5,000 మంది ఆటో కార్మికులకు ప్రమాద మరియు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేందుకు కృషి చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చల్మెడ లక్ష్మీనరసింహారావులకు ఆటో కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. బీమా మొత్తమైన రూ.5 లక్షలను మృతుడు బొమ్మనివేణి రాజు భార్య బొమ్మనివేణి భాగ్యలక్ష్మికి జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు అల్లే శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు బొల్లి రామ్మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ ఉమర్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికుల ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగిన సమయంలో కార్మికుల కుటుంబాలకు బీమా ఎంతో అండగా నిలుస్తుందని అన్నారు. ఆటో కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించిన కేటీఆర్, చల్మెడ లక్ష్మీనరసింహారావులకు ఆటో కార్మికుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజు కుటుంబానికి బీమా సొమ్ము అందడం ద్వారా కుటుంబానికి కొంత ఆర్థిక భరోసా లభించిందని పేర్కొన్నారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వేములవాడకు చెందిన ఆటో కార్మికులు ఎం.ఏ. అంజద్ పాషా, మెడిపెల్లి రాజు, ఎం.డి. ఖాజా, షేక్ రఫీక్ పాల్గొన్నారు



# దోమల నివారణకు ప్రత్యేక మాన్సూన్ డ్రైవ్

**- ప్రతి శుక్రవారం 'ఫ్రైడేడ్రైడే' పాటించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్**





**హైదరాబాద్,ఆగస్టు8(పీసీడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ నగరంలో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టేందుకు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆగస్టు 11 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రత్యేక మాన్సూన్ డ్రైవ్‌లో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు IEC (ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్) కార్యక్రమాన్ని శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంటమాలజీ విభాగం అధికారులు దోమల నివారణకు చేపడుతున్న చర్యలను మంత్రికి వివరించారు. దోమల నియంత్రణకు వినియోగిస్తున్న వివిధ పరికరాలను మంత్రి పరిశీలించి, వాటి పనితీరు, వినియోగంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**విస్తృతంగా దోమల నివారణ చర్యలు**

దోమల ద్వారా డెంగ్యూ, చికున్‌గున్యా తదితర వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యల్లో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలో పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా:ప్రతి శుక్రవారం 'ఫ్రైడేడ్రైడే' కార్యక్రమం నిర్వహించడం. ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించడం. దోమల లార్వాలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టడం. జీహెచ్ఎంసీ పరిధిలో విస్తృతంగా ఫాగింగ్ నిర్వహించడం. దోమల నివారణపై కరపత్రాలు పంపిణీ చేయడం. పాఠశాలల్లో విద్యార్థులకు దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం. వర్షాల కారణంగా నిల్వ ఉన్న నీటిని తొలగించేలా ప్రజలకు సూచనలు చేయడం. ప్రజలు స్వీయ బాధ్యతతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలిప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడేడ్రైడే' కార్యక్రమంలో భాగంగా ఇళ్లలో, పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల లార్వాలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. డెంగ్యూ వంటి వ్యాధులు రాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని, ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమమని మంత్రి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ చేస్తున్న సూచనలను ప్రతి ఒక్కరూ పాటించి దోమల నివారణలో భాగస్వాములు కావాలని కోరారు.


**ఇంటింటికీ IEC కార్యక్రమం**




జీహెచ్ఎంసీ పరిధిలో 'ఫ్రైడేడ్రైడే' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి IEC కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. అమర్ సింగ్ నాయక్ తెలిపారు. దోమలను ఎలా నియంత్రించాలి, డెంగ్యూ, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల లార్వాలు కనిపించిన ప్రాంతాలను గుర్తించి, నీటి నిల్వలను వెంటనే తొలగించాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నిల్వ ఉన్న నీటిని కూడా ప్రజలు వెంటనే తొలగించాలని సూచించారు. ఎంటమాలజీ, శానిటేషన్ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# శేఖర్ సేనాపతి జన్మదినం సందర్భంగా ఘనంగా రక్తదాన శిబిరం

**రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన యువచైతన్య దీపం ఫౌండేషన్ వ్యవస్థాపకులు శేఖర్ సేనాపతి**






**రాజన్న సిరిసిల్ల ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన యువచైతన్య దీపం ఫౌండేషన్ వ్యవస్థాపకులు శేఖర్ సేనాపతి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా శేఖర్ సేనాపతి మాట్లాడుతూ.. తన జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదానం చేసిన ప్రతి ఒక్క రక్తదాతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావాలని కోరారు. తన జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ శేఖర్ సేనాపతి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం చేసిన దాతలందరికీ భగవంతుడు సంపూర్ణ ఆరోగ్యం, సంతోషం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్రీ బి. ప్రవీణ్ కుమార్, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి హరి ప్రసాద్, మమత మేడంతో పాటు ఆసుపత్రి సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**ముఖ్య అతిథులుగా పలువురు ప్రముఖులు**

రక్తదాన శిబిరానికి తెలంగాణ రాష్ట్ర ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ అండ్ హ్యూమన్ రైట్స్ స్టేట్ కార్యదర్శి లాల్ మొహమ్మద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే సిరిసిల్ల పట్టణ వాత్సల్య బ్లడ్ బ్యాంక్ ఫౌండర్ సుధాకర్ పాల్గొని రక్తదాతలను అభినందించారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని ఈ సందర్భంగా శేఖర్ సేనాపతి ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకు పరిమితం చేయకుండా రక్తదానం వంటి సేవా కార్యక్రమంతో నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. "ఒక్క యూనిట్ రక్తం.. ఒక ప్రాణానికి ఆశ" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా మానవతా విలువలను చాటుతూ, యువత సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.




# పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్..





**కరీంనగర్ టౌన్ ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని 6వ డివిజన్ బొమ్మకల్ గ్రామంలో నిర్వహించిన శ్రీ పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో నగర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మేయర్ ప్రార్థించారు. బొనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని, ఇటువంటి పండుగలు సమాజంలో ఐక్యతను, ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు మేకల వెంకటేష్, గాదె రూప శ్రీనివాస్, కో-ఆప్షన్ సభ్యులు ఎలగందుల నందకుమార్, నాయకులు పురమళ్ళ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రెండో శనివారం సెలవుకూ తూట్లు...!

**ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్..**

**యథేచ్ఛగా ప్రైవేట్ పాఠశాలల నిర్వహణ**

**నిబంధనలు ఉల్లంఘిస్తున్నా విద్యాశాఖ మౌనం.. విద్యార్థులపై చదువుల భారం,**

**ఉపాధ్యాయులపై అదనపు పని ఒత్తిడి**

**సెలవు రద్దు చేసే అధికారం ప్రైవేట్ స్కూళ్లకు ఉందా**

**నిబంధనలు కాగితాలకే పరిమితమా..**





**కల్లూరు, ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాల్సిన ప్రైవేట్ పాఠశాలలే వాటిని బేఖాతర్ చేస్తున్నాయా అంటే అవుననే అంటున్నారు విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన సెలవు హక్కును కూడా కొన్ని పాఠశాలల యాజమాన్యాలు హరిస్తున్నాయా అన్న ప్రశ్నలు ప్రస్తుతం విద్యావర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం నిర్దేశించిన విద్యా క్యాలెండర్ ప్రకారం రెండో శనివారం సెలవు దినంగా ఉన్నప్పటికీ, కొన్ని ప్రైవేట్ పాఠశాలలు యథావిధిగా తరగతులు నిర్వహిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. **సెలవు దినానా తరగతులు** విద్యార్థులకు చదువుతో పాటు విశ్రాంతి, కుటుంబం తో గడిపే సమయం, మానసిక ఉల్లాసం కూడా అవసరమే. ఈ ఉద్దేశంతోనే ప్రభుత్వం విద్యా క్యాలెండర్ లో నిర్దిష్ట సెలవు దినాలను కేటాయిస్తుంటుంది. అయితే సెలవు దినాల్లోనూ తరగతులు నిర్వహిస్తే విద్యార్థులకు నిరంతర చదువుల ఒత్తిడి తప్ప మరేమీ మిగలదని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. చిన్నారుల మానసిక ప్రశాంతత, శారీరక విశ్రాంతిని పరిగణనలోకి తీసుకోకుండా పాఠశాలలను నిర్వహించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయులపై అదనపు భారం ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిర్దేశిత పని దినాలకు అదనంగా విధులు నిర్వహించాల్సి రావడం, సెలవు దినాల్లోనూ పాఠశాలకు హాజరు కావాల్సి రావడం వల్ల వారిపై పని ఒత్తిడి పెరుగుతోందని పలువురు అంటున్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కూడా విద్యా వ్యవస్థలో కీలక అంశమేనని విద్యావేత్తలు గుర్తుచేస్తున్నారు. **అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహిస్తున్నాయనే ఫిర్యాదులు, వార్తలు వెలువడుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలు అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజాస్వామ్యవాదులు, విద్యావేత్తలు కోరుతున్నారు. **నిబంధనలు పాటించకపోతే విద్యార్థులకు ఏం బోధిస్తారు** ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాల్సిన పాఠశాలలే వాటిని ఉల్లంఘిస్తే విద్యార్థులకు క్రమశిక్షణ, చట్టపాలన, బాధ్యత గురించి ఎలా బోధిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల హక్కులు, విశ్రాంతి, మానసిక ఆరోగ్యాన్ని గౌరవించడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత అని పేర్కొంటున్నారు. **కఠిన చర్యలు తీసుకోవాలి** ప్రభుత్వ విద్యా క్యాలెండర్, సెలవుల పట్టికను అన్ని గుర్తింపు పొందిన పాఠశాలలు తప్పనిసరిగా పాటించేలా విద్యాశాఖ పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రెండో శనివారం పాఠశాలలు నిర్వహిస్తున్నాయా లేదా అన్నదానిపై ఆకస్మిక తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత యాజమాన్యాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం సెలవు ప్రకటిస్తే దాని ఉద్దేశం ఏమిటి విద్యార్థులకు విశ్రాంతి కల్పించడానికే కదా ఆ ఉద్దేశాన్ని నిర్వీర్యం చేసేలా పాఠశాలలు నడిపితే అధికారులు ఎందుకు స్పందించరు అని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా మేల్కొని, నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

# గ్రామాభివృద్ధికి సహకరిస్తాం

**ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం.. పార్టీ పెద్దల సహకారంతో ముందుకు**

**ఓటమి వచ్చినా ప్రజా సేవ ఆగదు.. డ్రైనేజీ పనులు త్వరలోనే పూర్తి చేసేలా కృషి**



**కల్లూరు, ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్):**ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, అదే స్ఫూర్తితో గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోట్రు అర్జున్ రావు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితర సీనియర్ నాయకుల సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యర్రబోయినపల్లిలో డ్రైనేజీ వ్యవస్థపై ఇటీవల వస్తున్న కథనాల నేపథ్యంలో ఆయన స్పందిస్తూ గ్రామాభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, పంచాయతీ ఎన్నికలకు ముందే అధికారుల పాలనలో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. **రూ.30 లక్షలతో సీసీ రోడ్లు** యర్రబోయినపల్లి గ్రామంలో సుమారు రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు అర్జున్ రావు తెలిపారు. ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రెండు గ్రామాల్లో సుమారు రూ.8 లక్షలతో బోర్లు వేయించి, మోటార్ల సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. **పేదలకు ఇందిరమ్మ ఇళ్లు** నిరుపేదలకు 25 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించడంలో కృషి చేసినట్లు తెలిపారు. రెండో విడతలో మరో 30 ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సహకారంతో గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరినట్లు చెప్పారు. అలాగే గ్రామంలో 82 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయించేందుకు కృషి చేసినట్లు వెల్లడించారు. **డ్రైనేజీకి రూ.1.70 కోట్లు మంజూరు** యర్రబోయినపల్లి గ్రామ అభివృద్ధిలో ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ కోసం సుమారు రూ.1.70 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు అర్జున్ రావు తెలిపారు. పనులు చేపట్టేందుకు ఎవరు ముందుకు వచ్చినా తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, త్వరలోనే డ్రైనేజీ పనులు ప్రారంభించి పూర్తి చేసే విధంగా కృషి చేస్తామని చెప్పారు. **ఓటమి వచ్చినా ప్రజాసేవే లక్ష్యం** పంచాయతీ ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పటికీ ప్రజల సంక్షేమం, గ్రామాభివృద్ధి విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అర్జున్ రావు స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సహాయ సహకారాలు అందించడమే తమ బాధ్యత అన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఎవరు పనిచేసినా అది ప్రజల సంక్షేమం కోసమేనని పేర్కొన్నారు. **అపోహలకు తావివ్వొద్దు** ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పిన విషయాన్ని అర్జున్ రావు గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో పార్టీ కోసం పనిచేసినా, ఎన్నికల అనంతరం ప్రజలందరినీ సమానంగా చూడాలన్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా దయానంద్ విధానాన్ని ఆదర్శంగా తీసుకుని పనిచేస్తానన్నారు. గ్రామాభివృద్ధి విషయంలో ఎలాంటి అపోహలు, తప్పుడు సంకేతాలకు తావివ్వకుండా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అందరూ కలిసి పనిచేయాలని కోరారు.

# జాతీయ యువజన కాంగ్రెస్ జెండావిష్కరణను జయప్రదం చేయండి

**• యువజన కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులకు అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్ విజ్ఞప్తి.**




**ఖమ్మం, ప్రతినిధి ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్):**జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 9వ తేదీ ఉదయం 9:00 గంటలకు సంజీవరెడ్డి భవన్‌డీసీసీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు వేజండ్ల సాయి కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ ) అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, నియోజకవర్గ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేజండ్ల సాయి కుమార్ పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యువతలో ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత, దేశ సేవా భావాలను మరింతగా పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు.

# నేడు చెప్పల్ బజార్‌లో బుజిలి మహంకాళి అమ్మవారి జాతర



**హైదరాబాద్, ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** బోనాల పండుగ సందర్భంగా యంగ్ మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ ఆదివారం చెప్పల్ బజార్ లో బుజిలి మహంకాళి అమ్మవారి జాతర ఉంటుందని నిర్వహకులు లడ్డూ యాదవ్ తెలిపారు. ఆదివారం రాత్రి 7 గంటలకు బుజ్జిలి మహంకాళి అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు, 10వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు అమ్మవారి రథోత్సవం, పోతరాజులు, జానపద కళాకారుల ప్రదర్శన ఉంటుందని అన్నారు.


# విద్యార్థినుల భవిష్యత్తే మా ప్రధాన లక్ష్యం

**- గురుకుల అభివృద్ధే మా ఏకైక ధ్యేయం**

**- గురుకుల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోపి నాగలక్ష్మి, ఉప చైర్మన్‌గా కొంచర్ల ప్రశాంతి, ప్రధాన కార్యదర్శిగా ప్రముఖ జర్నలిస్ట్ దుబ్బాకుల శ్రీనివాసరావు**

**- నేలకొండపల్లి గురుకుల పేరెంట్స్ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక**





**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థినుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని, పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వాములైతే విద్యార్థులు మరింత ఉన్నత ఫలితాలు సాధిస్తారని, నేలకొండపల్లి గురుకుల పాఠశాల అభివృద్ధే ధ్యేయంగా, విద్యార్థినుల చదువు, ఆరోగ్యం, భద్రత, మౌలిక వసతుల కల్పనకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని నూతనంగా ఎన్నికైన పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోపి నాగలక్ష్మి, ఉప చైర్మన్ కొంచర్ల ప్రశాంతి, ప్రధాన కార్యదర్శి ప్రముఖ జర్నలిస్ట్ దుబ్బాకుల శ్రీనివాసరావులు అన్నారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి గురుకుల పాఠశాలలో శనివారం పేరెంట్స్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా నేలకొండపల్లి ఉపసర్పంచ్ గోపి నాగలక్ష్మి, ఉప చైర్మన్‌గా కొంచర్ల ప్రశాంతి, ప్రధాన కార్యదర్శిగా ప్రముఖ జర్నలిస్ట్ దుబ్బాకుల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా అరుణ, అర్చన, రోజా, భాగ్యశ్రీ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పేరెంట్స్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గురుకుల పాఠశాల అభివృద్ధి కోసం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని తెలిపారు. పాఠశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, అవసరమైన వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. విద్యార్థినులు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేందుకు అవసరమైన మౌలిక వసతులు, పరిశుభ్రత, తాగునీరు, భోజనం, ఆరోగ్యం, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. విద్యార్థినులు చదువులో రాణించి ఉత్తమ ఫలితాలు సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం విద్యాశాఖ అధికారులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి పనిచేస్తామని తెలిపారు. ప్రతి విద్యార్థిని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేలా అవసరమైన సహకారం అందిస్తామన్నారు. గురుకుల పాఠశాలకు, తల్లిదండ్రులకు, పేరెంట్స్ కమిటీకి మంచి పేరు తీసుకురావాలంటే విద్యార్థినుల విద్యాభివృద్ధే అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పేరెంట్స్ కమిటీ విద్యార్థినుల హాజరు, చదువు, క్రమశిక్షణను పర్యవేక్షించడం, డ్రాప్‌అవుట్లను నివారించడం, పాఠశాల అభివృద్ధికి అవసరమైన సూచనలు చేయడం, విద్యార్థుల ఆరోగ్య భద్రతపై దృష్టి పెట్టడం, భోజనం, తాగునీరు, పరిశుభ్రత వంటి సౌకర్యాలను పర్యవేక్షించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును పరిశీలించడం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం కల్పించడం వంటి అంశాల్లో చురుకైన పాత్ర పోషించనుంది. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గోరింట్ల విజయకుమారి మాట్లాడుతూ.. పేరెంట్స్ కమిటీకి పాఠశాల యాజమాన్యం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. విద్యార్థినుల విద్యాభివృద్ధి, పాఠశాల అభివృద్ధి, ఉత్తమ ఫలితాల సాధనకోసం పేరెంట్స్ కమిటీతో సమన్వయంతో పనిచేస్తామని చెప్పారు. ప్రతి విద్యార్థిని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ఉపాధ్యాయులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. విద్యార్థినుల ప్రతిభను వెలికితీసి, వారిలో దాగి ఉన్న సామర్థ్యాలకు సరైన మార్గనిర్దేశం అందించడమే పాఠశాల లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జె. దుర్గ, గత ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గంధసిరి శ్రీలత, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి , సాంప్రదాయానికి, వైభవానికి ప్రతీక బోనాల పండుగ.....

**- ఎస్ఆర్ హైస్కూల్ బోనాల వేడుకల్లో బిజెపి కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు**




**కరీంనగర్ ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, సాంప్రదాయానికి, వైభవానికి ప్రతీకయిన బోనాల పండుగకు ఎంతో విశిష్టత ఉందని, ఆ గొప్ప సంప్రదాయాలను భావి తరాలైన పిల్లలకు తెలియజేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు అన్నారు. కరీంనగర్ పట్టణం జ్యోతి నగర్ లో గల ఎస్ ఆర్ హై స్కూల్ ఆధ్వర్యంలో శనివారం రోజున బోనాల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సాంప్రదాయ వేషధారణలతో, ఘనంగా బోనాలు సమర్పిస్తూ చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర వైభవాన్ని చాటిచెప్పే బోనాల పండుగ విశిష్టతను చిన్ననాటి నుండే విద్యార్థులకు వివరించాలని తెలిపారు. కేవలం చదువు మాత్రమే కాకుండా, పాఠశాల స్థాయిలో ఇలాంటి సాంస్కృతిక వేడుకలను నిర్వహించడం ద్వారా పిల్లల్లో మన సంప్రదాయాల పట్ల గౌరవం, ఆసక్తి పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. అమ్మవారి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తూ జరుపుకునే ఈ పండుగ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు.

# ఆదివాసీ హక్కుల కోసం ఆగస్టు 9న పోరాట ప్రతిజ్ఞ చేద్దాం

● ఆదివాసీ దినోత్సవాన్ని జాతరగా కాకుండా హక్కుల పోరాట దినంగా నిర్వహించాలి: పోటు రంగారావు





**ఖమ్మం, ప్రతినిధి, ఆగస్టు 8 (పీసీడబ్ల్యూ న్యూస్):**ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ, వారి హక్కుల సాధన కోసం పోరాట ప్రతిజ్ఞ చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవం అంటే కేవలం ఉత్సవాలు, జాతరలు నిర్వహించడం కాదని, ఆదివాసీల భూమి, అడవి, నీటిపై హక్కుల కోసం గొంతెత్తి పోరాడే రోజుగా నిర్వహించాలని ఆయన అన్నారు.ఆదివాసీలు తరతరాలుగా అడవులను, ప్రకృతిని కాపాడుకుంటూ ప్రకృతితో మమేకమై జీవిస్తున్నారని, అయితే వలస పాలన కాలం నుంచి నేటి వరకు వారి భూములు, అటవీ వనరులపై దాడులు కొనసాగుతున్నాయని పోటు రంగారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలను వారి భూములు, అడవుల నుంచి దూరం చేస్తూ వారి జీవనాధారాలను దెబ్బతీసే విధానాలను ప్రభుత్వాలు విడనాడాలని డిమాండ్ చేశారు.ఆగస్టు 9న వివిధ ప్రాంతాల్లో సదస్సులు, ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించి ఆదివాసీల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పిలుపునిచ్చింది.

# 10న జరిగే జైల్ భరోను జయప్రదం చేయండి

**- సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు**



**పెనుబల్లి, ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్)**:స్థానిక వి.యం.బంజర్ రింగ్ సెంటర్ నందు ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శనివారం సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ప్రచారం చేస్తున్న క్రమంలో కరపత్ర ప్రచారం మరియు జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది అని తెలిపారు. ఈ సమావేశానికి రైతు సంఘం మండల అధ్యక్షుడు చిట్టి మోదుల కృష్ణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు మాట్లాడుతూ ఆగస్టు 10వ తారీఖున మండల కేంద్రంలో జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్ లు వాటి నిబంధనలను పూర్తిగా రద్దు చేయాలని, విద్యుత్ సంస్కరణ బిల్లు 2025ను వెనక్కి తీసుకోవాలి విద్యుత్తు రంగం ప్రైవేటీకరణను నిలిపివేయాలని, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి వారికి కనీస వేతనం అమలు చేయాలి అన్నారు. ఈ బిజీ రాంజీ చట్టాన్ని రద్దు చేసి పునరుద్ధరించాలని 200 రోజులు పని కల్పించి రోజు కూలి 7వందల రూపాయలు ఇవ్వాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సు ప్రకారం కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. పేద రైతులు కోసం సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని, ఈ డిమాండ్స్ సాధన కోసం సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, ఆధ్వర్యంలో జరుగుతున్న జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చెమట విశ్వనాథం, మిద్దె స్వామి, అన్నపురెడ్డి లక్ష్మయ్య, గుజ్జ వెంకటేశ్వర్లు, మల్లెల వెంకటేశ్వర్లు, బాలస్వామి, తేజ వత్ రాములు, నాగేశ్వరావు, నాగయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరి వెంకన్న మృతి బాధాకరం

● వెంకన్న భౌతికకాయానికి తోట రామారావు ఘన నివాళి ● కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.. దహన ఖర్చులకు రూ.5 వేల ఆర్థిక సాయం



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** కందుకూరి వెంకన్న మృతి తీవ్రంగా కలచివేసిందని మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు తోట రామారావు అన్నారు. శనివారం వెంకన్న మృతి విషయం తెలుసుకున్న తోట రామారావు వెంకన్న భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో తాను భాగస్వామినని తెలియజేస్తూ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.వెంకన్న కుటుంబానికి అండగా నిలిచిన తోట రామారావు దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం తక్షణంగా రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా తోట రామారావు మాట్లాడుతూ.. కందుకూరి వెంకన్న మృతి ఎంతో బాధాకరమని, ఆయన మరణం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తీరని లోటని అన్నారు. ఆత్మీయుడిని కోల్పోయిన కుటుంబం పడుతున్న బాధను మాటల్లో చెప్పలేమని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు అండగా నిలవడం మానవతా బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.వెంకన్న ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించిన తోట రామారావు, ఆయన కుటుంబ సభ్యులకు ఈ అపారమైన విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం, ఆత్మస్థైర్యం ప్రసాదించాలని కోరారు. కుటుంబానికి అవసరమైన సమయంలో తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కుమార్, నరేష్, మహేష్, ఉపేందర్ రెడ్డి, ఆర్టీసీ వెంకన్న, ఉమారాణి, శ్రీనివాసచారి, గోపమ్మ, రెడ్డి మంగ, రవి, నరేష్, వీరభద్రం, కంటే కుమార్, సూరేపల్లి సాంబశివరావు, కే. నరసింహారెడ్డి, మంగా రవి, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొని కందుకూరి వెంకన్న భౌతికకాయానికి నివాళులర్పించారు.

# జైల్ భరో జయప్రదం చేయండి

**- వ్యవసాయ కార్మిక సంఘం వైరా మండల అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు పిలుపు.**



**ఖమ్మం, ప్రతినిధి ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్):**క్విట్ ఇండియా స్ఫూర్తితో ఈ నెల 10వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వైరా రూరల్ అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు, సిఐటియు వైరా మండల నాయకులు తోట నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆగస్టు 10న వైరాలో జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శనివారం వైరా రూరల్ మండలంలో గల గ్రామాలను సందర్శించి ప్రజలను కలిసి ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా విప్పలమడక గ్రామంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రైతు, వ్యవసాయ కార్మికుల, సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేటు సంస్థలకు లాభాలు చేకూర్చే విధానాలను అవలంబిస్తూ, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చిందని అదేవిధంగా కార్మికుల వ్యవసాయ కార్మికులు సాధించుకున్న హక్కులు చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లు తీసుకొచ్చిందని వారు విమర్శించారు. ఎన్నో పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న ఎన్నో రకాల హక్కులను, చట్టాలను హరించే నాలుగు లేబర్ కోడ్ లును రద్దు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా వ్యవసాయ కార్మికులకు నష్టపరిచే విబిజీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదల జీవనోపాధిని దెబ్బతీసే కేంద్ర ప్రభుత్వ చర్యలను ప్రజలు వ్యవసాయ కార్మికులు అడ్డుకోవాలని వారు పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగాన్ని నష్టపరిచే విధంగా కార్పొరేట్ సంస్థలకు, విదేశీ గుత్త పెట్టుబడిదారులకు అనుకూలంగా లాభాలు చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదీన వైరా మండల కేంద్రంలో జరిగే జైల్ బరో కార్యక్రమాల్లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గరిడేపల్లి సుబ్బారావు, వెదుళ్ళ కృష్ణకుమారి, గరిడేపల్లి కస్తూరి, అక్కిశెట్టి రాములమ్మ, అక్కిశెట్టి రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల సాధనకు విద్యార్థులంతా ఏకమవ్వాలి





**సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లో మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభ**

**పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి**

**ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల ఎంఎస్ఎఫ్ ఇంచార్జి ముక్కెర ముఖేష్ మాదిగ**



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడితేనే హక్కులను సాధించుకోవచ్చని ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల ఎంఎస్ఎఫ్ ఇంచార్జి ముక్కెర ముఖేష్ మాదిగ అన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆటంకంగా మారుతున్న సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఖమ్మం నగరంలోని స్థానిక ఎస్ఎంహెచ్ హాస్టల్‌లో శనివారం ఖమ్మం జిల్లా ఎంఎస్ఎఫ్ ఇంచార్జి ఊటుకూరి రత్నాకర్ మాదిగ అధ్యక్షతన విద్యార్థులు, విద్యార్థి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ముక్కెర ముఖేష్ మాదిగ హాజరై విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముక్కెర ముఖేష్ మాదిగ మాట్లాడుతూ... ఈ మహాసభకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభను జయప్రదం చేయడంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విద్యార్థులు, విద్యార్థి నాయకులతో విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా ప్రభుత్వం బకాయిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గురుకుల విద్యార్థులకు సొంత భవనాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి, భోజనం, ఆరోగ్య సదుపాయాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రతి విద్యార్థి భవిష్యత్తు సమాజ భవిష్యత్తుతో ముడిపడి ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు తమ సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల హక్కుల కోసం జరిగే పోరాటంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని కోరారు.ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సమయానికి అందకపోవడం వల్ల పేద, బడుగు బలహీనవర్గాల విద్యార్థుల చదువులు మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును కాపాడేందుకు ఎంఎస్ఎఫ్ నిరంతరం విద్యార్థుల తరఫున పోరాడుతుందని స్పష్టం చేశారు.సమస్యలను తెలుసుకోవడం మాత్రమే కాదు.. పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించడమే లక్ష్యంగా సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలిరావాలని కోరారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలతో పాటు హాస్టల్, గురుకుల విద్యార్థుల మౌలిక సదుపాయాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఎంహెచ్ హాస్టల్‌లో ఎంఎస్ఎఫ్ కమిటీని ఏర్పాటుచేసి అధ్యక్షుడిగా దాసరి గోపిని ఎన్నుకున్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ చురుకుగా పనిచేయాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం జిల్లా ఎంఎస్ఎఫ్ కో-ఇన్‌చార్జ్ శ్యాంప్రసాద్ మాదిగ, జిల్లా కమిటీ సభ్యులు కొత్తపల్లి సాయి మాదిగ, రాము మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ రికార్డు సాధనకు సిద్ధమైన ఆల్వాల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కరాటే క్రీడాకారుడు వి. సుధాకర్

**హైదరాబాద్, ఆగస్టు 08(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణకు చెందిన జాతీయ స్థాయి కరాటే క్రీడాకారుడు, మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఆల్వాల్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వి. సుధాకర్ అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ రికార్డు సాధించేందుకు సిద్ధమవుతున్నారు.జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో, ప్రముఖ కరాటే గురువు డా. జి.ఎస్. గోపాల్ రెడ్డి పర్యవేక్షణలో, భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ రికార్డు ప్రయత్నంలో వి. సుధాకర్ పాల్గొననున్నారు.ఈ రికార్డు ప్రయత్నంలో 9 రకాల కరాటే టెక్నిక్స్‌తో కేవలం 8 నిమిషాల్లో 80 శాబాద్ (రాక్) టైల్స్‌ను విరగగొట్టే సాహసాన్ని ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమం ఆగస్టు 9న హైదరాబాద్‌లోని జీవీఆర్ కరాటే అకాడమీలో నిర్వహించబడనుంది.వి. సుధాకర్ 2013లో జీవీఆర్ కరాటే అకాడమీలో చేరి కరాటేలో శిక్షణ పొందుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్లో జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించడంతో పాటు, పలు రాష్ట్ర, జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను కైవసం చేసుకుని తన ప్రతిభను చాటుకున్నారు. ప్రస్తుతం ఆల్వాల్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా ప్రజాసేవ అందిస్తూనే, క్రీడా రంగంలోనూ నిరంతర సాధన కొనసాగిస్తున్న వి. సుధాకర్ ప్రపంచ రికార్డు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి, భారతదేశానికి మరింత గౌరవం తీసుకురావాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్నారు. జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, ప్రధాన శిక్షకులు డా. జి.ఎస్. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, వి. సుధాకర్ క్రమశిక్షణ, అంకితభావం, కఠోర సాధనకు ప్రతీక అని, ప్రపంచ రికార్డు ప్రయత్నంలో విజయవంతమై తెలంగాణకు, దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.



# క్రీడలతో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట

### ఖమ్మం జిల్లాలో స్కూల్ గేమ్స్ సంబరం!

### ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

### ప్రతిభకు ప్రాధాన్యం.. పారదర్శక ఎంపికలతో క్రీడాకారులకు ప్రోత్సాహం

### జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (డీఎస్‌జీఎఫ్) కార్యదర్శి డాక్టర్ యాస రామారావు



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పాఠశాల స్థాయిలోనే క్రీడా ప్రతిభను గుర్తించి, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దేందుకు, క్రీడలతో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేసేందుకు ఖమ్మం జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలను ఆదర్శవంతంగా నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (డీఎస్‌జీఎఫ్) కార్యదర్శి డాక్టర్ యాస రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ యాస రామారావు మాట్లాడుతూ... 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని అన్ని మండలాల్లో అండర్-14, అండర్-17 బాలురు, బాలికల క్రీడా పోటీలను క్రీడల వారీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభకు పెద్దపీట వేస్తూ, ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా పారదర్శక సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించి ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. క్రీడలు కేవలం గెలుపుఓటములకు సంబంధించినవి కావని, విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సమిష్టి భావన, ఓటమిని స్వీకరించి తిరిగి విజయాన్ని సాధించే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అందుకే ప్రతి విద్యార్థికి తన ప్రతిభను నిరూపించుకునే సమాన అవకాశం కల్పించడమే ఎస్‌జీఎఫ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆగస్టు 12న జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శుల సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో, ప్రతి మండలంలో ఎంఈఓ ఆధ్వర్యంలో పీడీలు, పీఈటీలు సమావేశమై మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శుల కొనసాగింపు, ఎన్నిక లేదా నామినేషన్‌తో పాటు మండల స్థాయి యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని సూచించారు. మండల స్థాయి పోటీలను ఆగస్టు 31లోపు, జిల్లా స్థాయి పోటీలను సెప్టెంబర్ 15లోపు, రాష్ట్ర స్థాయి పోటీలను అక్టోబర్ 10లోపు నిర్వహించే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి ఇంటర్-జోనల్, స్టేట్ ఎస్‌జీఎఫ్ పోటీల నిర్వహణకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా విద్యాశాఖాధికారి అనుమతితో ఆగస్టు 14లోపు సిద్ధం చేసి, ఆగస్టు 17న హైదరాబాద్‌లో నిర్వహించనున్న డీఎస్‌ఈఎస్‌జీఎఫ్ సమావేశానికి సమర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎస్‌జీఎఫ్ గేమ్స్ ఫీజుగా రూ.15 వసూలు చేసి, దాని వినియోగం, ఐడీ కార్డులు, మెరిట్, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, ట్రోఫీలు, క్రీడా సామగ్రి, భోజనం, ఇతర సదుపాయాలను ప్రభుత్వ నిబంధనలు, సంబంధిత అధికారుల అనుమతులకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి క్రీడలో నైపుణ్యం, ప్రతిభ ఆధారంగానే ఎంపికలు జరగాలని, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు, సాంకేతిక అధికారులు సమన్వయంతో సెలక్షన్స్, కాంపిటీషన్స్ నిర్వహించాలని సూచించారు. క్రీడాకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సందర్భాల్లో ప్రభుత్వ అనుమతులకు లోబడి సీఎస్ఆర్, స్పాన్సర్లు, దాతల సహకారం పొందేందుకు కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. "ఎస్‌జీఎఫ్ కేవలం పోటీల నిర్వహణ వేదిక కాదు.. పాఠశాల స్థాయిలోని ప్రతి చిన్నారి క్రీడా కలకు తొలి వేదిక. ఒక చిన్న గ్రామం నుంచి వచ్చిన ప్రతిభావంతుడైన విద్యార్థి రేపు రాష్ట్రానికి, దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగడానికి ఇది బాటలు వేస్తుంది" అని డీఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ యాస రామారావు పేర్కొన్నారు. క్రీడల్లో గెలిచిన వారికి మాత్రమే కాకుండా పాల్గొనే ప్రతి విద్యార్థికి క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం వంటి విలువలు జీవితాంతం తోడుంటాయని అన్నారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం కల్పించి విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లాలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు పారదర్శకత, సమన్వయం, క్రీడాస్ఫూర్తికి ప్రతీకగా నిలిచేలా నిర్వహించేందుకు అన్ని ఎంఈఓలు, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు, మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు, క్రీడా నిర్వాహకులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ప్రతి మైదానంలో ఒక ప్రతిభ పుడుతుంది.. ప్రతి ప్రతిభ వెనుక ఒక కల ఉంటుంది.. ఆ కలకు సరైన వేదిక, ప్రోత్సాహం, అవకాశం అందితే ఖమ్మం జిల్లా నుంచి ఎన్నో క్రీడా విజయాలు వెలువడతాయి. ఆ దిశగా ఎస్‌జీఎఫ్ పోటీలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# షైన్ హైస్కూల్‌లో మిన్నంటిన బోనాల సంబరాలు!

● తెలంగాణ సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యం: ప్రిన్సిపాల్ ప్రగతి రెడ్డి ● సంప్రదాయ దుస్తులు, ప్రత్యేక వేషధారణలతో అలరించిన విద్యార్థులు




**హనుమకొండ ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హన్మకొండ రాంనగర్‌లోని షైన్ హైస్కూల్ ఐఐటీ & మెడికల్ ఫౌండేషన్ బ్రాంచ్‌లో యాజమాన్యం ఆధ్వర్యంలో బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ వేషధారణలతో వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల వేషధారణలు, బోనాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రగతి రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు, భవిష్యత్ తరాలకు మన పండుగల విశిష్టత తెలియజేయాలనే ఉద్దేశంతో బోనాల వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు సంప్రదాయాలను మరచిపోకుండా ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. షైన్ హైస్కూల్ చైర్మన్ కుమార్ యాదవ్ ప్రోత్సాహంతో పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి షైన్ స్కూల్ విద్యార్థి విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల బోనాల వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# మురికి కాలువ సమస్యను పరిష్కరించిన సర్పంచి ఎం రాజు



**ఇల్లంతకుంట ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇల్లంతకుంట మండల కేంద్రంలో 9వ వార్డులో ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న మురికి కాలువ సమస్యను సర్పంచ్ 'యం.రాజు'దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా మురికి నీరు నిలవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని సమస్యను చెప్పగానే వెంటనే స్పందించి పరిష్కరం చూపించిన సర్పంచ్ కి వార్డు సభ్యులకు,సహకరించిన వార్డు ప్రజలకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి, కార్మికులకు ధన్యవాదాలు తెలియజేసారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు

**నర్సంపేట ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారులు పెద్ది సుదర్శన్ రెడ్డి మరణించిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లిన ఎంపీఆర్డీ ఇండియా వరంగల్ జిల్లా అధ్యక్షులు అడ్డ రాజు, నర్సంపేట వర్కింగ్ ప్రెసిడెంట్ చింత కుమారస్వామి, అభ్యుదయ యూత్ అధ్యక్షులు నత్తి శ్యామ్ తదితరులు కుటుంబ సభ్యులను కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పెద్ది సుదర్శన్ రెడ్డి దివ్యాంగుల పట్ల ప్రత్యేకమైన ఆప్యాయత, అభిమా నాన్ని చూపేవారని, దివ్యాంగులకు ప్రతి విషయంలో అండగా నిలుస్తూ



వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం



అందించేవారని గుర్తు చేసుకున్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ఆయన అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలే మని అన్నారు. ఆయన మరణం దివ్యాంగుల సమాజా నికి, ప్రజలకు తీరని లోటని

# బెంగాల్ తరహా కుట్రలు తెలంగాణలో సాగవు: ఎంపీ మల్లు రవి




### గాంధీ భవన్‌లో విలేకరుల సమావేశం

**హైదరాబాద్ ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలను దుర్వినియోగం చేస్తూ పశ్చిమ బెంగాల్‌లో అత్యంత అప్రజాస్వామికంగా అధికారంలోకి వచ్చిందని, అయితే బెంగాల్ తరహా రాజకీయ కుట్రలు తెలంగాణలో నడవవని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. శనివారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో అసలు ప్రజాస్వామ్యం బతికే ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, బీజేపీ వైఖరి వల్లే 'జంజీ'లు పుట్టుకొచ్చారని పేర్కొన్నారు. నాటి స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ ప్రభుత్వం ఎలాగైతే లాఠీచార్జీలు చేసిందో, ఇప్పుడు కేంద్రం జంజీలపై కూడా అదే రీతిలో దౌర్జన్యానికి దిగుతోందని మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పటికీ కేంద్ర హోం మంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు.

నక్సలైట్లది రాజ్యాంగేతర ఉద్యమమని, కానీ జంజీలు రాజ్యాంగానికి లోబడే ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతున్నారని స్పష్టం చేశారు. తమ తదుపరి టార్గెట్ తెలంగాణ అని బీజేపీ నేతలు వ్యాఖ్యానించడంపై మల్లు రవి తీవ్రంగా స్పందించారు. పశ్చిమ బెంగాల్‌తో తెలంగాణను పోల్చలేమని, అస్సాం, బీహార్ తరహాలో తెలంగాణలో అధికారంలోకి రావాలని బీజేపీ కలలు కంటోందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి కనీసం మూడో స్థానం వస్తుందో రాదో కూడా గ్యారంటీ లేదని, కాంగ్రెస్ పార్టీ 100 శాతం తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జంజీలతో పాటు ప్రజలందరిలోనూ విశేష ఆదరణ ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసి సీఎం ప్రజా పరిపాలన సాగిస్తున్నారని ప్రశంసించారు. కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేస్తే, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి పేదవాడికీ నిలయం కల్పించేందుకు 7 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తోందని తెలిపారు. అలాగే పేదలను ఆదుకునేందుకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల పంపిణీతో పాటు సన్న బియ్యం అందిస్తున్నామని వివరించారు.

# కాంగ్రెస్ నాయకులను పరామర్శించిన మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ



**ఇల్లంతకుంట ఆగస్టు 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :**
ఇల్లంతకుంట మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మామిండ్ల కనకరాజు యువ నాయకుడు ఎంద్ర చందన్ కుతురు అనారోగ్యంతో ఉండగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు "కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి"మాజీ ఎంపీపీ "వూట్కూరి వెంకటరణారెడ్డి" పరమర్శి ంచారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆ కుటుంబాలకు భరోసా ఇచ్చారు. వారితో పాటు సర్పంచ్ నవీన్ రెడ్డి, ఉపసర్పంచ్ అవినాష్, మాజీ ఉప సర్పంచ్ సోల్లు కిష్టస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నారెడ్డి భాగ్యరెడ్డి, సోల్లు ప్రశాంత్, చంద్రమౌళి, సోల్లు అంజయ్య, శ్రీకాంత్, సంపత్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.




# బిడ్డ కోసం సమంత సన్నద్ధత..

## ఆ పుస్తకం చదువుతూ పోస్ట్!

స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన గర్భధారణ సమయాన్ని ఆస్వాదిస్తున్నారు. తన భర్త, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి తొలి బిడ్డకు స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్న ఆమె, మాతృత్వానికి సంబంధించిన సన్నాహాలను ప్రారంభించారు. ఈ క్రమంలో తాను చదువుతున్న ఓ పుస్తకం తాలూకు ఫొటోను శనివారం అభిమానులతో పంచుకున్నారు.
'ఆగస్ట్ ఎనర్జీ' అనే క్యాప్షన్‌తో సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫొటోలను షేర్ చేశారు. అందులో ఆమె సోఫాలో విశ్రాంతి తీసుకుంటూ 'ఇనా మేస్ గైడ్ టు చైల్డ్‌బర్త్' అనే పుస్తకాన్ని చదువుతూ కనిపించారు. కాబోయే తల్లిదండ్రులకు ప్రసవానికి సంబంధించిన వివిధ అంశాలపై ఈ పుస్తకం అవగాహన కల్పిస్తుంది. ఈ పోస్టులో జిమ్ సెల్ఫీలతో పాటు తన భర్త పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన మధుర క్షణాలను కూడా ఆమె పంచుకున్నారు.గత జూన్ నెలలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'మా ఇంటి బంగారం' సక్సెస్ మీట్‌లో సమంత తన గర్భధారణ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. "ఈ సినిమా తర్వాత నా ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా చిన్న విరామం తీసుకుంటాను. మెటర్నిటీ లీవ్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత మళ్లీ నా అభిమానుల కోసం మరో సినిమాతో తిరిగి వస్తాను" అని ఆమె స్పష్టం చేశారు. గతేడాది డిసెంబర్ 2025లో కోయంబత్తూరులోని ఈశా యోగా సెంటర్‌లో రాజ్ నిడిమోరును సమంత వివాహం చేసుకున్నారు.


# 12న ఇరుముడి ట్రైలర్ విడుదలకు సన్నాహాలు

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




# కొరియన్ కనకరాజుతో హిట్ కొట్టిన వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ.10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన 'గద్దలకొండ గణెళిష్' సినిమాను 'కొరియన్ కనకరాజు' అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ రైట్స్‌కు అనుగుణంగా చూస్తే ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తే బ్రేక్ ఈవెన్ దిశగా వెళ్లే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో కూడా 'కొరియన్ కనకరాజు' మంచి జోరు చూపించింది. బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో కలిపి 2.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం వెల్లడించింది. తొలి రోజు వసూళ్లతో పాటు సినిమాకు వస్తున్న మౌత్ టాక్ కూడా పాజిటివ్‌గా ఉండటం మేకర్స్‌కు మరింత కలిసొచ్చే అంశంగా మారింది.





# చిక్ కేఫ్ స్టైల్‌లో పూజా హెగ్డే గ్లామర్ షో.. యెల్లో డ్రెస్ హైలైట్!

బుట్టబొమ్మ పూజా హెగ్డే మరోసారి తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. విదేశీ వీధుల్లో, ఒక వినూత్నమైన కేఫే బ్యాక్‌డ్రాప్‌లో దిగిన ఆమె లేటెస్ట్ ఫొటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. పసుపు రంగు బాడీకాన్ డ్రెస్‌లో తన స్టైలిష్ లుక్స్‌తో కుర్రకారు హృదయాలను కొల్లగొడుతున్నారు. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ షేర్ చేసిన ఈ గ్లామరస్ పిక్స్ అభిమానులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఆ ఫొటోషూట్ విశేషాలు మీకోసం.బుడాపెస్ట్ కేఫేలో చిక్ అండ్ గ్లామరస్ లుక్: ప్రస్తుతం వెకేషన్ మూడ్‌లో ఉన్న పూజా హెగ్డే, బుడాపెస్ట్‌లోని ఒక వినూత్నమైన కేఫేలో ఈ సరదా ఫొటోషూట్ చేశారు. గోడల నిండా చేతిరాత నోట్లు, నేలపై ఎండుగడ్డి చల్లి ఉన్న క్రియేటివ్ కేఫేలో ఒక కలప స్టూల్‌పై కూర్చుని ఆమె క్యూట్‌గా ఫోజులిచ్చారు. "పుట్ ద పెస్ట్ ఇన్ బుడాపెస్ట్" అని తన ఫొటోలకు ఇచ్చిన సరదా క్యాప్షన్ నెటిజన్లను భలే ఆకట్టుకుంటోంది. యెల్లో అవుట్‌ఫిట్ అట్రాక్షన్: ఈ ఫొటోషూట్‌లో పూజా హెగ్డే ధరించిన యెల్లో కలర్ ఫిట్టెడ్ మినీ డ్రెస్ ఆమె అందాన్ని మరింత పెంచింది. డీప్ వి-నెక్‌లైన్‌తో ఉన్న ఈ అవుట్‌ఫిట్‌కు తోడు ఓవర్ సైజ్డ్ క్రీమ్ షేడ్ సన్ గ్లాసెస్, కలర్‌ఫుల్ ప్యాటర్న్డ్ వేస్ట్ బ్యాగ్ మరియు హైహీల్డ్ మెటాలిక్ ప్లాట్‌ఫార్మ్ శాండల్స్‌ను మ్యాచ్ చేశారు. ఇక తన పక్కనే కలర్‌ఫుల్ బ్యాగ్ ఉంచి, ఒక చేతితో జుట్టును సరిచేసుకుంటూ ఆమె ఇచ్చిన క్యూట్ స్మైల్ నెటిజన్లను ఫిదా చేస్తోంది. తొలి అడుగు నుంచి సౌత్, నార్త్ పాన్ ఇండియా రేంజ్: 'ముగమూడి' అనే తమిళ సూపర్ హీరో చిత్రంతో వెండితెరకు పరిచయమైన పూజా, తెలుగులో 'ఒక లైలా కోసం', 'ముకుంద' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

# రామాయణ తొలుత విదేశాల్లో విడుదల



రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్‌లో ముందుగా.. ఆ తర్వాత భారత్‌లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి నవంబర్ 8 రోజే విడుదల చేస్తాం అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బడ్జెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.

# 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో చేరిన ది ఒడిస్సీ

హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన తాజా విజువల్ వండర్ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల్లోనే ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో (దాదాపు రూ.9,500 కోట్లకు పైగా) అడుగుపెట్టింది క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో 1 బిలియన్ మార్కును అందుకున్న మూడో చిత్రంగా 'ది ఒడిస్సీ' నిలిచింది. అంతకుముందు ఆయన దర్శకత్వం వహించిన 'ది డార్క్ నైట్' (1.008 బిలియన్), 'ది డార్క్ నైట్ రైజెస్' (1.08 బిలియన్) ఈ ఘనత సాధించాయి. గతేడాది వచ్చిన 'ఓపెన్‌హైమర్' ఈ మార్కుకు కాస్త దూరంలో ఆగిపోయింది. కాగా, ఈ వీకెండ్ ముగిసేసరికి 'ది ఒడిస్సీ' నోలన్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక్క ఐమాక్స్ స్క్రీన్ల నుంచే ఏకంగా 257 మిలియన్ డాలర్ల వసూళ్లు (దాదాపు రూ.2,445 కోట్లు) రావడం విశేషం. త్వరలోనే ఐమాక్స్ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగానూ ఇది నిలవనుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అయిన చైనాలో ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. చైనా వ్యాప్తంగా దాదాపు 800 ఐమాక్స్ స్క్రీన్లతో పాటు వేలాది సాధారణ స్క్రీన్లలో అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయడానికి మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. దీంతో ఈ సినిమా మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది.

